

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ

❖ ఏప్రిల్ 25 వరకు పొడిగింపు ❖ జిల్లా కలెక్టర్ వెల్లడి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త** అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2025 - 26 కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తూ అభ్యర్థుల కోసం రిజిస్ట్రేషన్ చివరి తేది ఏప్రిల్ 10 నుండి ఏప్రిల్ 25 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. అగ్నివీర్స్‌లోని వివిధ కేటగిరీలలోకి రిక్రూట్‌మెంట్ కోసం రిజిస్ట్రేషన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్ఆర్మీ.నిక్.ఇన్ ద్వారా చేయవచ్చునని, రిజిస్ట్రేషన్ చివరి తేదీ 25 ఏప్రిల్ 2025 అని, ఒక అభ్యర్థి ఇప్పుడు అగ్నివీర్‌లో రెండు వేర్వేరు కేటగిరీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సిఈఈ)ని తొలిసారిగా తెలుగుతో సహా 13 భాషల్లో నిర్వహిస్తున్నారని, ఎన్‌సిసి ఏ,బి,సి సర్టిఫికేట్ హోల్డర్లు, అన్ని కేటగిరీలకు మెరిటోరియస్ క్రీడాకారులకు మరియు అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీకి ఐటిఐ/డిప్లొమా అర్హత పొందిన అభ్యర్థులకు కూడా బోనస్ మార్కులు ఇవ్వబడతాయని తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, అగ్నివీర్ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, అగ్నివీర్‌గా సైన్యంలో రిక్రూట్‌మెంట్ కోసం మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అన్న క్యాంటీన్లలో ప్రమాణాలను పాటించాలి

కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో సూచించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూర్యతేజ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక వెంగళరావు నగర్ అన్న క్యాంటీన్ ను కమిషనర్ మంగళవారం సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో చల్లటి, సురక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, టోకెన్ విధానం ద్వారా మాత్రమే ప్రజలకు ఆహారాన్ని అందించాలని క్యాంటీన్ నిర్వహకులకు సూచించారు. నిర్దేశించిన మోతాదు నాణ్యమైన ఆహారం అందించాలని, క్యాంటీన్ ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆహారం ప్లేట్లు, ఇతర వంట సామాగ్రిని క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకొని, విచ్చేసే ప్రజలతో సాదరంగా మెలగాలని సిబ్బందికి సూచించారు.ప్రతిరోజు క్యాంటీన్‌కు విచ్చేసి ఆహారంస్వీకరిస్తున్న వారిసంఖ్య,సరఫరా చేస్తున్నఆహారం మోతాదు,తదితర వివరాలను ఎప్పటికప్పుడు నివేదికగా క్యాంటీన్ల వారీగా అందించాలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

## ఆగని చికెన్ వేస్ట్ దందా..

- ప్రత్యేక దృష్టి సారించిన కోవూరు పోలీసులు



**కోవూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు తీవ్రస్థాయిలో విఘాతం కలిగించి పరిసరాలను దుర్వాసన వెదజల్లుతున్న చికెన్ వేస్ట్ అక్రమ రవాణా చాటుమాటుగా కొనసాగుతూనే ఉంది. ఇటీవల కాలంలో కోవూరు పోలీసులు ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి రెండు వారాల వ్యవధిలో ఆరు చికెన్ వేస్ట్ వాహనాలను సీజ్ చేసి వాటిపై కేసు నమోదు చేశారు. ప్రధానంగా ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణా, చెన్నై, బెంగుళూరు నుంచి కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామునకోవూరు, ్పాంతాలకు వస్తున్న రెండు చికెన్ వేస్ట్ వాహనాలను కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు పోలీసులు ఈ వాహనాలను సీజ్ చేసి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కోవూరు ఎఫ్‌డీవో శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేయించారు. అనంతరం ఈ చికెన్ వేస్ట్‌ను పెన్నానది ప్రాంతంలో గొయ్యి తీసి అందులో పూడ్చేలా చర్యలు చేపట్టారు. కోవూరు నియోజకవర్గంలోని ఏ ప్రాంతంలో కూడా చికెన్ వేస్ట్ రవాణా జరగరాదని, ఇది వరకే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సంబంధిత పోలీస్, మత్స్యశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చేపలు సాగుచేసే వారు చికెన్ వేస్ట్ కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఎఫ్‌డీవో శ్రీనివాసులు తెలిపారు.



## ఉపాదిలో 11లక్షల అవినీతి అక్రమాల వెలుగు

ముగ్గురు సిబ్బందిపైవేటు



**వరికుంటపాడు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** జాతీయ ఉపాదిహామి పదకం సామాజిక తనిఖీలో భాగంగ 11లక్షల 18వేల 776రూపాయల అవినీతి అక్రమాలను గుర్తించినట్లు డ్వామాపిడి గంగాభవానితెలిపారు. 2023,24ఆర్దిక సంవత్సరానికి సంబందించి షుమారు 11కోట్ల పనులకు సంబందించి ఆడిట్ జరుగగ మంగళవారం ప్రజావేదికను నిర్వహించారు.వివిద గ్రామాలలో లేనివారి పేర్లపైమరణించినవారి పేర్లపై మస్టర్లు వేసివుండడం అందకు సంబందించి లక్షలాదిరూపాయలు దుర్వినియోగమైనట్లు ఆడిట్‌బృంద గుర్తించింది.మరికొన్ని గ్రామాల్లో మస్టర్లలో సంతకాలు లేకుండనేపేమెంట్లు చేయడం గుర్తించారు.ఈఆడిట్‌లో బాగంగ రికవరీకి సంబందించి గణేశ్వరాపురంలో 2,50,164రూపాయలు,నల్లబోతులవారిపల్లి గ్రామంలో 2,17,989రూపాయలు,పెద్దిరెడ్డివల్లి1,68,766రూపాయలు,తోటలచెరువువల్లిలో 1,35,540,వరికుంటపాడు 44,840,గువ్వాడి 49,231,జి కొండారెడ్డిపల్లి వెయ్యి రూపాయలు,ఇస్కపల్లి 20,978,జడదేవి 1,7043,కాంచెరువు3వేల రూపాయలు,టి కొండారెడ్డిపల్లి 4వేల13రూపాయలు, కృష్ణంరాజుపల్లి 7వేలు,మహ్మదాపురం 25,939,నార్తకొండాయపాళెం 3,500,పామూరుపల్లి 5461,రామాపురం 7712,తిమ్మారెడ్డిపల్లి 1386,తూర్పుబోయమడుగుల 32,270,తూర్పుచెన్నంపల్లి 10,500, తూర్పురొంపిదొడ్ల 4,500,వేంపాడు 3వేలు,విరువూరు 1049,యర్రంరెడ్డిపల్లి 13,633,రూపాయల నురికవరికి ఆదేశించినట్లు డ్వామాపిడి తెలిపారు.గతంలో పనిచేసిన ఫీల్డ్అసిస్టెంట్లు రాకపోవడంతో ఆడిట్ బృందానికి పన్నులు చూపించలేదని అందులోభాగంగ కొలతలలో తేడ,మస్టర్లలో తేడాతోఇద్దరు టిఎలు,1ఇసిని తాత్కాలికంగ సస్పెండ్ చేసినట్లు డ్వామాపిడి తెలిపారు.మండలంలోని ప్రధానపంచాయతీలకు సంబందించిన నివేదికలు చదివే సమయంలో మైకులు ఆపివేయడం కొసమెరుపుఏదేమైన ఉపాదిలో జరిగిన అవినీతి పూర్తిస్థాయిలో బయటకు రాలేదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మండల ప్రజావేదికకు కనీసస్థాయిలోకూడ ప్రజలు హాజరుకాకపోవడం గమనార్హం

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 52.358 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50, ఎన్ఎఫ్‌సికి200, పెన్నా డెల్టాకు 500, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.731మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు

# కాకాణి వంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటం సిగ్గుచేటు

- తప్పులు చేయడం తప్పించుకొని తిరగడంలో కాకాణి నెంబర్ వన్

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు రాజకీయాల్లో కాకాణి లాంటి వ్యక్తి ఉండటం అందరి కర్మ అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. కోర్టు కేసు నిమిత్తం మంగళవారం కోర్టుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తప్పులు చేయడం, పోలీసులకు చిక్కకుండా పారిపోవడంలో కాకాణి నంబర్ వన్ అని అన్నారు. అంతర్జాతీయ నేరస్తులు దొరుకుతున్నారు. కానీ కాకాణి చిక్కడం లేదని, తప్పులు చేశాడు. కాబట్టే పిరికిపందలా పారిపోయాడని పేర్కొన్నారు. కాకాణి లాంటి వ్యక్తి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నందుకు వైసీపీ నేతలందరూ సిగ్గుపడాలని, గోవర్ధన్ రెడ్డి వాడే భాషను ఎవరైనా మీపై మాట్లాడితే బాగా మాట్లాడారని చప్పట్లు కొడతారా అంటూ వైసిపి నేతలను ప్రశ్నించారు. ఆనందయ్య ఆయుర్వేదం మందును అమ్మకానికి పెట్టామని, తనపై నర్మద రెడ్డి చేత కాకాణి గోవర్ధన్ రెడ్డి కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో కేసు పెట్టించారని గుర్తు చేశారు. తనపై బనాయించిన అక్రమ కేసుల విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే ఇక్కడ కాకాణి తనను రాయలేని భాషలో దుర్భాషలాడాడని అన్నారు. మొన్న క్వార్జ్ అక్రమ మైనింగ్ కేసులో అరెస్టు భయంతో నెల్లూరు నుంచి పరారైన తర్వాత హైదరాబాద్‌లో ఓ మీడియాతోనూ అదే విధంగా మాట్లాడాడని గుర్తు చేశారు. ఏదో కొంప మునిగిపోయిందని ప్రెస్ మీట్ల మీద ప్రెస్ మీట్లు పెడుతున్న వైసీపీ ఇన్ చార్జిలకు, ఎంపీ, ఎమ్మెల్సీలకు సమాధానంగా ఈ విషయాలు చెబుతున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి, మిగిలిన వైసీపీ ఇన్ చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలందరికీ నేను ఒక్క మాట చెబుతున్నానని, కాకాణి వాడే భాషనే మీపై వాడిస్తా, నేనైతే ఆ భాష మాట్లాడలేను మా నాయకుల్లో ఎవరో ఒకరి చేత మాట్లాడిస్తా, మీ తల్లిదండ్రులను తిడతారు ఆయన వాడే దరిద్రుడు వంటి పదాలను వాడుతారు. అప్పుడు కూడా మీరు చప్పట్లు కొడతారా అని ప్రశ్నించారు ప్రశ్నించారు. క్వార్జ్ అక్రమ రవాణా చేస్తే తప్పుడు కేసు అని చెబుతూ కాకానిని వెనకేసుకు రావడానికి సిగ్గుండాలి అని దుయ్యబట్టారు. మైనింగ్ లీజు లేకుండా 14 ప్రొక్లెయిన్లు, 30 డంపర్లు, ఒక గోదాముతో పాటు మరో ట్రక్కులో ప్రమాదకర పేలుడు పదార్థాలు వందల కోట్ల విలువైన క్వార్జ్ అక్రమ తవ్వకం ఇవన్నీ కాకాణికి తెలియదంటారా అని ప్రశ్నించారు. తప్పు చేశాడు కాబట్టే పిరికిపందలా పారి పోయాడని, గతం లోనూ విదేశాల్లో నాకు ఆస్తులున్నాయని నకిలీ పత్రాలు సష్టించి ఊరు వదిలి ఉడాయించాడని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి కాకాణి గోవర్ధన్ రెడ్డి చాలా బుద్ధిమంతుడిగా కనిపిస్తున్నాడంట చంద్రశేఖర్ రెడ్డి కూడా ఒక బుద్ధిమంతుడు కదా.. కాబట్టే ఆయనకు కూడా అలాగే కనిపిస్తున్నాడేమో తాను ఏ తప్పు చేయకుండానే ఈ రోజు కోర్టుల చుట్టు తిప్పుతున్నాడని, కాకాణికి మాత్రం పోలీసుల విచారణకు హాజరయ్యే దమ్ము లేదని విమర్శించారు.

# కొట్టాల వద్ద ఆటోనగర్ వల్ల ఎంతో మందికి ఉపాధి లబిస్తుంది

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి





**బుచ్చి ఏప్రిల్ 15 ప్రభాతవార్త** బుచ్చి మండలంలో కొట్టాల వద్ద అనేక సంవత్సరాల ఆటో కార్మికుల కల నెరవేరిందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. ఆటోనగర్‌కి మంగళవారం శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతు ఆటో నగర్‌కి 7 ఎకరాల 30 సెంట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. వెంటనే ఈ భూమిని చదును చేయించి మరో 2 మూడు నెలలో వారికి స్వాధీనం చేయనున్నట్లు తెలిపారు.గతంలో ఏప్రభుత్వం చేయలేని విధంగా నేడు కూటమి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అభివృద్ధి,సంక్షేమం రెండు సమపాళ్ళుగా చేసుకొని ముందుకు సాగుతున్నారని ఆమె ప్రశంసించారు. ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలు చేయడంలో కూడా కోవూరు నియోజకర్గమే ముందు వుందని 38 వేల టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని ఆమె పేర్కున్నారు.విపిఆర్ పౌండేషన్ ద్వారా ఆటోనగర్ భూమిని చదును చేయిస్తామని ఆమె హామి ఇచ్చారు. ఆటో నగర్‌ని ప్రారంబించుకోవడం ఆనందంగా ఉందని ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, ఎంపిపి భీమతాటి వెంకటరమణయ్య, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు, మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య, బత్తల హరికృష్ణా ఏటూరు శివరామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, కౌన్సిలర్ వైష్ణవి, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు,ఎంపిడిఒ శ్రీహరి, మైనార్టీనాయకులు షేక్ .పర్వీనా, శ్రీకాంత్‌రెడ్డి, పఠాన్ మహబూభాషా,కౌన్సిలర్ రహమత్,దశరద్, వల్లూరు రాఘవరెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, ఆటో కార్మిక యూనియన్‌నాయకులు యస్దానిబాషా, శీనయ్య,మన్సూర్, ఫిరోజ్,షబ్బీర్, షాకీర్, మురళీ,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక శాఖ మంత్రి కలిసిన కోవూరు నియోజకవర్గ జనసేన నేత



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త** కోవూరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ చప్పిడి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ సంబంధించిన కొన్ని విషయాలపై ఆయనతో చర్చించారు

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : జిల్లా జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్



**నెల్లూరు అర్బన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఆర్అండ్‌బి ఎస్ఈ గంగాధర్ కమిటీ సభ్యులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను ప్రధాన కూడళ్లు, కళాశాలలు, హైస్కూల్‌లలో చేపడుతున్నట్లు చెప్పారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండింగ్‌లో వున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా ఏసి కూరగాయల మార్కెట్ సెంటర్, జిల్లా పోలీసు కార్యాలయం సెంటర్, కెవిఆర్ జంక్షన్, కనకమహల్ సెంటర్, రామలింగాపురం, విఆర్‌సి ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మే నెల మొదటివారంలోగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఏర్పాటుచేసిన సిగ్నల్స్ వ్యవస్థలోని లోటుపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా పకడ్బందీగా సిగ్నల్ పాయింట్లను ఏర్పాటుచేయాలని సూచించారు. నగరంలో ఇంకా సిగ్నల్ పాయింట్లు అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేయాలని సూచించారు. బుజబుజనెల్లూరు నుంచి కోవూరు వరకు గల జాతీయరహదారిపై ప్రమాదాలు జరుగుతున్న 11 ప్రాంతాల్లో సోలార్క్ లెటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. అలాగే జాతీయరహదారిపై వాహనదారులు విశ్రాంతి తీసుకునేందుకు మనుబోలు సమీపంలో సర్వే ల్యాండ్ రికార్డుల అధికారి కొన్ని ప్రదేశాలను ఎంపిక చేశారని, వీటిలో ఒక ప్రదేశాన్ని ఎంపికచేసి వాహనదారుల విశ్రాంతి కోసం అన్ని మౌలికవసతులతో ఏర్పాట్లు చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. పంచాతీరాజ్, ఆర్అండ్‌బి రహదారుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు, పెయింటింగ్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొదలకూరురోడ్డు వద్ద డివైడర్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. జాతీయ రహదారిపై మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రద్దీ ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులను రోడ్లపై వదలకుండా చూడాలని, పశువులకు రేడియం స్టిక్లర్లను ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. జాతీయ రహదారులతో కలిసే పంచాయతీరాజ్ రహదారుల వద్ద ప్రమాదాల నివారణకు 52 ప్రాంతాల్లో భద్రతా చర్యల కోసం రూ.168లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు జేసీకి వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిలో 33 ముఖ్యమైన ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా భద్రతా చర్యలు చేపట్టేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే ఆర్అండ్‌బికి సంబంధించి ప్రమాదభరిత ప్రాంతాల్లో 120 లక్షలతో భద్రతా చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్అండ్‌బి ఎస్ఈ తెలిపారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో 3200 లైట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలుపగా, ఇంకా అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ ¿లైట్లు ఏర్పాటుచేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. వార్డుఅమెనిటీ సెక్రటరీల ద్వారా సర్వే చేయించి అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ధనలక్ష్మీపురం వద్ద డివైడర్ బ్రేక్ వచ్చిన ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. హిట్ అండ్ రన్ కేసులను త్వరగా పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరంలో 390 సిసి కెమెరాలు పనిచేస్తున్నాయని మున్సిపల్ అధికారులు తెలుపగా, వీటిని నిరంతరం పర్యవేక్షించేందుకు పోలీసుకంట్రోల్‌రూంకు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ డార్ ఆన్‌లైన్ సిస్టంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా డేటా ఎంట్రీ పూర్తిచేయాలని, అన్ని హాస్పిటల్స్‌లో ఇందులో నమోదయ్యేలా చూడాలని వైద్యారోగ్యశాఖ అధికారు లకు జేసీ సూచించారు. ఈ డేటా ఆధారంగా ఏ ప్రదేశంలో ఎక్కడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయో తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాల న్నారు. నగరంలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేసేందుకు హైవే సమీపంలోని శ్రీవేణుగోపాలస్వామి కాలేజీని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందుకు దేవాదాయశాఖ నుంచి అనుమతి రావాల్సి వుంద న్నారు. అలాగే మద్రాసు బస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు వాహనదారులు ఇష్టప్రకారం పార్కింగ్ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, దీనికి పరిష్కారమార్గం చూపుతూ పూర్తి వివరాలను వచ్చేసమావేశంలో తెలపాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ ప్రదేశాల్లో పార్కింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించాలన్నారు. అధికారులందరూ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని. జేసీ పిలుపునిచ్చారు. నెల్లూరు, ఒంగోలు ఎన్‌హెచ్ఎ పిడిలు ఎం.కె. చౌదరి, ఎం. విద్యాసాగర్, సర్వే ల్యాండ్‌రికార్డుల ఎడి నాగేశ్వర్, డిఎస్పీ జి. శ్రీనివా స రావు, ట్రాఫిక్ సిఐ కె రామకృష్ణ, మున్సిపల్ ఎస్ఈలు రామ్మోహన్‌రావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ వేసవి సీజన్లో వృద్ధులు ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దంత వైద్యురాలు జ్యోతి ప్రభ తెలిపారు. కోవూరులోని శాంతినగర్ లో ఉన్న శ్రీ పార్వతీ వృద్ధుల ఆశ్రమంలో మంగళవారం ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ ప్రత్యేక దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధులలో ఎవరైనా దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతుంటే అటువంటివారు క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. మందుల వాడకంలో నిర్లక్ష్యం వహిస్తే అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుం దన్నారు సందర్భంగా దంత పరీక్షలు నిర్వహించి ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ టూత్ బ్రష్ పేస్టు మోత్ వాష్ నుఅందజేశారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాలిని పుష్ప ఆరోగ్య సిబ్బంది ఉన్నారు

## పకృతి వ్యవసాయంపై మరింత అవగాహన అవసరం



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** భూమి ఆరోగ్యాన్ని మరింత కాపాడేందుకు రైతులు ప్రస్తుతం పకృతి వ్యవసాయంపై మరింత అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ సిఎన్ ఎఫ్ అడిషనల్ డి పి ఎం జి. మునిరత్నం తెలిపారు కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉద్యానవన వ్యవసాయ వెలుగు ఐసిడిఎస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు ప్రధానంగా ప్రస్తుతం వరి సాగు చేసి రైతులందరూ పంట కోసిన తర్వాత నవధాన్యాలు సాగు చేస్తే తద్వారా భూమిలో సారవంతం పెరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు వ్యవసాయం సాగు చేసే రైతులు సాగు ఖర్చులు తగ్గించి ఆదాయం వచ్చే విధంగా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. అదేవిధంగా మహిళలు కిచెన్ గార్డెన్ న్యూట్రి గార్డెన్ పై అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలియజేశారు ముఖ్యంగా పురుగు మందులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై అలవాటు చేసుకోవాలన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇంద్రావతి ఏపిఎం వి సుబ్బరాజు పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్ రాము శోభ చైతన్య బాబు ఎన్ఎఫ్ఏ కోటేశ్వరరావు ఏపీ సిఎన్ ఎఫ్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు

## పౌష్టికాహారంతప్పనిసరిగా తీసుకోవాలి



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** గర్భవతులు బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని హోమియోపతి వైద్యులు డాక్టర్ కరుణాకర్ తెలిపారు కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ అట్ల కాలనీలోఉన్న అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడకార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భవతులకు బాలింతలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికా హార లోపం ఉంటే కాన్పు కూడా కష్టమయ్యే పరిస్థితి వస్తుందన్నారు ముఖ్యంగా మహిళ తల్లి అయిన తర్వాత నుంచి రెండు సంవత్స రాల వయసు బిడ్డకు వచ్చేవరకు 1000 రోజులు చాలా విలువైనవని ఈ సందర్భంగా ఆయన సూచించారు ఈ కాలంలో పౌష్టికాహారం క్రమం తప్పకుండా సమపాలలో తీసుకోవాలని సూచించారు అంగన్వాడీ సూపర్వైజర్ ప్రమీల అంగన్వాడీ కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ఉన్నారు

## సంఘమిత్ర ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** డిఆర్డిఏ జిల్లా అధికారుల సూచనల మేరకు కోవులోని సంఘమిత్ర కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఎండ వేడిమి కి గాను ప్రత్యేకంగా మజ్జిగ చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం వి సుబ్బరాజు మాట్లాడుతూ ఎండ కాలం పూర్తి అయ్యేంతవరకు ఈ చలివేంద్రను నిరంతరం కొనసాగించేలా తమ వంతు చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్ రాము శోభ చైతన్య బాబు వివో ఏలు పొదుపు మహిళలు ఉన్నారు

## ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ముఖ్యంగా ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన కోసం నిర్వహిస్తున్న స్పెషల ఆధార్ క్యాంపు సేవలను వారు పూర్తిస్థాయిలో సద్విని చేసుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో ఈవోపీఆర్డి. శ్రీనివాసులు తెలిపారు కోవుల్లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో రెండు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు మాట్లాడుతూ కోవూరు పంచాయతీ పరిధిలోని ఒకటి రెండు మూడు నాలుగు వార్డులకు సంబంధించిన గిరిజనులు వీటితోపాటు పాటూరు సచివాలయం పరిధిలోని గిరిజన కులానికి చెందిన ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు లేకపోతే ఆధార్ కార్డు పోయినఈ కేంద్రాల్లో వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఉద్యోగులు ఉన్నారు

## దంతాల పట్ల విద్యార్థులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి దంతాల పరిరక్షణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యురాలు డాక్టర్ జ్యోతి ప్రభ తెలిపారు కోవూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే మాసోత్స వాల సందర్భంగా ఈ పాఠశాలను విద్యార్థులందరికీ దంత పరీక్షలు నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు నోటిని పరిశుభ్రంగా ఉంచుకోకపోతే అనారోగ్యం బారిన పడే పరిస్థితి వస్తుందన్నారు విద్యార్థులకి టూత్ బ్రష్ను ఏ విధంగా ఉపయోగించుకోవాలి ఏ విధంగా దంతాలను పరిశుభ్రం చేసుకో వాలో పూర్తిస్థాయిలో వివరించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ ఆరోగ్య సిబ్బంది ఉపాధ్యాయులు ఉన్నారు

## అటక్కెక్కిన ప్రతిపాదనలు

## - లోవొల్టేజితో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

బిట్రగుంట ఏప్రిల్ 15 ప్రభాతవార్త : బోగోలు మండలంవిశ్వనాధరావుపేట పంచాయతీలో గత కొన్ని సంవత్స రాలుగా విద్యుత్ వాడకం ఎక్కువగా ఉండటంతో దానికి తగ్గ ట్రాన్స్ఫార్మర్ల సామర్థం పెంచక పోవడంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవికాలంలో అయితే వారి బాధలు వర్ణనతీతంగా ఉన్నాయి. గతంలో లో వోల్టేజ్ పరిష్కారానికి అదనపు ట్రాన్స్ఫారాలు ఏర్పాటు, ట్రాన్స్ఫారాల సామర్థం పెంపు ప్రతిపాదనలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన వాటికి చలనం లేకపోవడంతో ప్రతిపాదనన్ని ఆటకెక్కినాయి. దీంతో ప్రతి వేసవిలోనూ తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు విద్యుత్ బిల్లులు మాత్రం నెలకు వేలకు వేలు, వందలకు వందలు వస్తున్నాయని నాణ్యమైన విద్యుత్ ను అందించడంలో మాత్రం ఆ శాఖ విఫలమైందని విమర్శలు తలెత్తుతున్నాయి. రాత్రివేళల్లో ఫ్యాన్లు కూడా సక్రమంగా తిరగకపోవడంతో ఉక్కపోతాతో అల్లాడిపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గతంలో చేసిన ప్రతిపాదనలన్నీ ఆచరణలో పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పౌష్టికాహారంపై తప్పక అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోవూరు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భవతులు, బాలింతలు తప్పని సరిగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూపర్వైజర్ రాధిక, అన్నారు. కోవూరులోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో మం గళవారం భాగంగా గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులకు, పౌష్టికాహార లోపం ఉంటే కాన్పులు కూడా కష్టమయ్యే పరిస్థితి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, పాలు, గుడ్లు సమపాళ్లలో తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, , తదితరులు ఉన్నారు.

## సిఎం జన్మదినం సందర్భంగా షటిల్ టోర్నమెంట్



**కావలిరూరల్, ఏప్రిల్15 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సూచన లమేరకు దేవరకొండ శ్రీనివాస్, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన కావలి నియోజకవర్గ పరిధిలో షటిల్ టోర్నమెంట్ను ఎంతోమందిని విద్యావేత్తలుగా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దినటువంటి కావలి జవహర్భారతి కళాశాల క్రీడామైదానంలో ఉన్నటువంటి షటిల్కోర్టు ప్రాంగణంలో ఈ షటిల్పోటీలు జరగనున్నాయని దేవరకొండ శ్రీనివాసులు తెలియచేశారు. కావున నియోజకవర్గంలో ఉన్న క్రీడాకారులందరూ ఈ ఆటలపోటీల్లో పాల్గొని విజయాన్ని దక్కించుకోవడానికి ప్రయత్నించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి కావలి నియోజకవర్గపార్టీ శ్రేణులందరూ హాజరై నారా చంద్రబాబునా యుడు జన్మదినం సందర్భంగా షటిల్టోర్నమెంట్ను ప్రారంభించుకుందామని నిర్వాహకులు తెలియచేశారు.

## శంఖరవరం గ్రామంలో పోషకాహార పక్షోత్సవాలు



**వింజమూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** వింజమూరు మండలం శంఖవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం పరిధిలో పోషకాహార పక్షోత్స వాల కార్యక్రమంలో భాగంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ సూపర్వైజర్ ఎస్కే షకీలా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్దిదారుల మాధ్యూల్లో కుటుంబాల నమోదు చేసుకోవడానికి మార్గ నిర్దేశం చేయడానికి ప్రత్యేక గృహ సంద ర్శనాలు వీహెచ్ఎస్ ఎన్ డీ సమయంలో లబ్దిదారుల నమోదు కార్యక్రమాలు ఏడబ్ల్యూడబ్ల్యూ అండ్ ఏఎస్హెచ్ లబ్దిదారులకు రిజిస్ట్రేషన్లు సహాయం చేయుట వంటి కార్యక్రమాలను అంగన్వాడీ కేంద్రం నందు స్థానిక లబ్దిదారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఏడో పోషకాహార పక్షత్సోవంలో నిర్దేశించిన నాలుగు అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. 1000 రోజుల సంరక్షణ పోషణ ట్రాకర్లో స్వయంగా లబ్దిదారులు నమోదు చేసుకోవడం, పోషకాహార లోపాలకు గురైన పిల్లల ప్రత్యేక సంరక్షణ ఆరోగ్యవంతమైన జీవన శైలి కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎల్.శైలజ, ఆశా వర్కర్ ఎంఎస్కే స్రవంతి, తల్లులు, గర్భవతులు, బాలింతలు ఉన్నారు.

## విశ్రాంత ప్రధానోపాధ్యాయుడును అభినందించిన ఎంఈఓ



**ఉదయగిరి, ఏప్రిల్15, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీని వాసులు, మం డల ప్రాథమిక పాఠశాల ఉదయగిరి దళిత వాడ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యా శాఖ అధికారి విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలించిన తదుపరి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించా రు. అదే విధంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్టీ హుస్సేన్(కలీం) కుమారుని పుట్టిన రోజు వేడుకల సందర్భంగా విద్యార్థులకు చికెన్ బిరియాని, అరటి పండ్లు అందించారు. తాను ప్రధానోపాధ్యాయునిగా పని చేసిన పాఠశాలలో విద్యార్థులకు తరచూ తిథి భోజనం అంది స్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలీంని ఆదర్శంగా తీసుకొని విశ్రాంత ఉపాధ్యాయులు, దాతలు విద్యార్థులకు నాణ్యమైన తిథి భోజన్ అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు

ఉదయగిరి, ఏఫ్రపల్ 15, ప్రభాతవార్త ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొండాయపాలెం పంచాయతీల్లో గల అంగన్వాడీ కార్యకర్తలు అందరూ కలిసి గంగిరెడ్డిపల్లి అంగన్శాడీ సెంటర్ నందు పౌష్టికాహార పక్షోత్స వాలను మంగళ వా రం అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. గర్భవతులకు, బాలింతల కు,తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న వస్తువులతోనే పౌష్టికాహారం తయారు చేసుకవోడంతో పాటు ఏ వస్తువుల్లో ఎ లాంటి పోషకాలు ఉంటాయి అనే అం శంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎన్.సునీత, సూపర్వైజర్ షాను, మహిళా పోలీసు నాగవ నిత, ఉపాధ్యాయురాలు వాలంటరీ నాజ్యోతి, కొండాయపాలెం అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మీ, వెంకటరావుపల్లి అంగన్వాడీ కార్యకర్తల లక్ష్మమ్మ, గానుగపెంట పల్లి అంగన్వాడీ కార్యకర్త సుగుణమ్మ, మా సాయిపేట అంగన్వాడీ కార్యకర్త రమణమ్మ, గంగిరెడ్డిపల్లి అంగన్వాడీ కార్యకర్త పద్మ, పిల్లల తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహార పక్షోత్సవాలు



**ముత్తుకూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** ప్రతి అంగన్వాడి కేంద్రంలో ఈ నెల 8వ తేఇ నుండి 22వ తేది వరకు పౌష్టికాహార పక్షోత్స వాలు నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళ వారం మండలంలోని పిడతా పోలూరు సెక్టారు బ్రహ్మదేవి ఎస్టీ అంగన్వాడి సెంటర్ నందు 1000 రోజుల సంరక్షణ గురించి గర్భవతి నుండి బిడ్డ పుట్టిన 24 నెలల బిడ్డ వరకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. గర్భవతులను, బాలింతలను పిల్లలను పోషణ ట్రాకర్ యాప్ నందు ఎలా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ ఎన్ మంజుల, అంగన్వాడి కార్యకర్తలు జి. హరికుమారి, ఎన్. రాజేశ్వరి, ఎం. సుమలత తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం



**ముత్తుకూరు, ఏప్రిల్ 15, ప్రభాత వార్త** పౌష్టి కాహార పక్షోత్స వాల కార్యక్రమంలో భాగంగా మం గళవారం మండలంలోని నారికేళ్ళపల్లి పంచాయితీలోని సుబ్బారెడ్డి పాళెం అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. సూపర్వైజర్ సుబ్బమ్మ మాట్లా డుతూ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 8వ తేది నుండి 22వ తేది వరకు ప్రతి అంగ న్వాడి కేంద్రంలో నిర్వహించారు. పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు ఇవ్వాలని అన్నా రు. గర్భవతులు నమోదు ఈకెవైసిలు చేసామ న్నారు. అంగన్వాడి టీచర్స్ జి. మాధవీలత, డి. సుమతి, బి. కృష్ణమ్మ, ఆయాలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## సోమశిల, పికెపాడులో పోషన్ పక్వాడా



**అనంతసాగరం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** అనంతసాగరం మండ లంలోని సోమశిల, పికెపాడు అంగన వాడీకేంద్రాల్లో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద హాజరయ్యారు.ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింత లు, చిన్నపిల్లల్లో పోషకాహార పదార్ధాల లోపం వలన కలిగే నష్టాల గురించి తెలియజేస్తూ మంచి ఆహారం తీసుకునేలా తల్లులకు అవగాహన కల్పిండమే పోషన్పక్వాడా ఉద్దేశమన్నారు. గర్భిణీలు తక్కువ ఖర్చుతో మనకు అందుబాటులో ఉన్న పోషక ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఆకు కూరలు, మునగ ఆకు పొడి, కరివేపాకు పొడి, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని , గర్భిణీలకు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, గర్భిణీలు, స్త్రీలు పాల్గొన్నారు.

## నెల్లూరుపాళెం ఎస్టీకాలనీలో పోషన్ పక్వాడా



**ఆత్మకూరు, ఏప్రిల్15,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్టీ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పక్షోత్స వాలను అంగన్వాడీ కార్యకర్త ఎ.మస్తానమ్మ ఆధ్వర్యంలో వాసిలి సెక్టార్ సూపర్వైజర్ కె.నారాయణమ్మ పర్యవేక్షణలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజర య్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు తామే పోషణట్రాకర్ అనే యాప్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా తాము ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని అందుకు తగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వాలన్నారు. అనంతరం చిన్న పిల్లల్లో వయసుకు తగిన బరువుకంటే ఎక్కువ బరువుతో ఉంటూ ఊబకాయం వస్తుందని ఆ ఊబకాయం వస్తే పిల్లలు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడతారని అలా రాకుండా తల్లిదండ్రులకు అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు.ఊబకాయం వలన కలిగే నష్టాలను తెలియజేయాలన్నారు. వారు తీసుకునే ఆహారంలో మార్పులు చేయాలన్నారు. ఎక్కువగా జంక్ ఫుడ్ వలన ఈ ఊబకాయం వస్తుందనే విషయాన్ని పిల్లలకు కూడా తెలియజేయాలన్నారు. 1000రోజుల సంరక్షణ గురించి వివరించారు. గర్భవతుల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. అందుకు తగిన ఆకు కూరలు, పాలు , గుడ్లు ఆహారంలో ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మావతి ,అంగన్వాడీ కార్యకర్తలు వాణిశ్రీ,లక్ష్మీనారాయణమ్మ, పరమేశ్వరి, నరసమ్మ,సరస్వతి, వెంకటలక్ష్మి, గర్భవతులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారులు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు తూర్పు ముస్లిం వీధి అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడా పట్టణంలోని తూర్పు ముస్లింవీధి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్త సాహేరా , నీలిమ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్స వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆత్మకూరు సెక్టార్ సూపర్వైజర్ ఎం.రత్నమ్మ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు, తల్లులు రక్తహీనతనుండి బయట పడాలని, దానికి తగిన ఆహారాన్ని ఆకు కూరలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలను తీసుకోవా లన్నారు. పోషన్పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పక్షోత్స వాలను నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గర్భవుతుల నమోదు, 1000రోజుల సంరక్షణ, ఊబకాయం తగ్గించడం తదితర అంశాల గురించి అంగన్వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు,ఎఎన్ఎం, తల్లులు, గర్భవతులు, బాలింతలు, కిశోరబాలికలు, మహిళలు, హెల్పర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

## మంచి వ్యక్తి అభివృద్ధి ప్రదాత ప్రతాప్‌రెడ్డిపై నిందలు వేయడం తగదు..!

### టిడిపి నేతలు ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోం.!!

### వైసిపి నేతల హెచ్చరికలు



**కావలి, ఏప్రిల్15 ప్రభాతవార్త** మంచి వ్యక్తి, కావలి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతూ నిందలువేయడం తగదని వైసిపి నేతలు తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. వైసిపి కావలి నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డి నివాసంలో మంగళవారం వైసిపి నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, బోగోలు మండల అద్యక్షుడు వీర రఘుయాదవ్, వైసిపి నేతలు పరుసు మాల్యాద్రి, దావులూరి మాల్యాద్రిలు మాట్లాడారు. టిడిపి నేతలు ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. పట్టణ అద్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్రెడ్డి మాట్లాడుతూ ప్రతాపన్న ఎంతో సహృదయుడని, ప్రతి ఒక్కరికి సహాయం చేయగల మనస్తత్వమని అటువంటి వ్యక్తిని విమర్శించడం మంచి పద్ధతికాదని హెచ్చరికలు చేశారు. ఏరియా వైద్యశాల కమిటీచైర్మన్గా గుత్తికొండ కిషోర్బాబు వైసిపి పాలనలో పనిచేశారని ఆనాడు ప్రతాప్రెడ్డి అనుకుంటే ఆయన అద్యక్షుడుగా కొనసాగుతారా అంటూ ఆయన ప్రశ్నించారు. కావలి ఏరియా వైద్యశాలలో 20కోట్లతో, అల్లూరు ఆసుపత్రిని 15 కోట్లతో, కావలి పట్టణ నాలుగు దిక్కుల్లో ప్రైమరి హెల్త్సెంటర్లు ఒక్కొక్కటి కోటిరూపాయలతో ఏర్పాటుచేశారు. ప్రతి వార్డులో అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. మౌలికవసతులు కల్పించారన్నారు. సంక్షేమపథకాలు, సచివాలయాలు, ఆర్‌బికె సెంటర్లు ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించారన్నారు. చెప్పుకుంటూపోతే చాలా అభివృద్ధి ఉందన్నారు. ఇంత అభివృద్ధి జరిగితే టిడిపి నేతల కళ్లకు కనపడలేదా, పొద్దస్తమానం విమర్శలు చేయడమే లక్ష్యమా అంటూ కేతిరెడ్డి మండిపడ్డారు.

**-వెన్నుపోటుపొడిచే నైజం ఎవరికి ఉందో తెలుసుకుంటే చాలు...**

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్యవైశ్యనేత కనమర్లపూడి వెంకటనారాయణ మాట్లాడుతూ మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ పోతుగంటి అలేఖ్య చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వెన్నుపోటు పొడిచే నైజం ఎవరికి ఉందో కావలి ప్రజలకు అందరికి, అన్ని పార్టీల నేతలకు తెలుసునన్నారు. తన గురువు మాజీ ఎఎంసి ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టికి వెన్నుపోటు పొడిచానని ఆయన కుమార్తె చెల్లి అలేఖ్యమ్మ మాట్లాడడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక పార్టీలో ఉంటూ పదవికోసం ఆమె తండ్రి గ్రంధికి తెలియకుండా రాజకీయమంతనాలు సాగించి, ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి రాత్రికిరాత్రి పార్టీ మారింది మా చెల్లి అలేఖ్యమ్మ అని ఆయన అన్నారు. అలాంటి చెల్లి నా మీద నిందలు వేయడం నీకు తగునా అంటూ ఆయన ప్రశ్నించారు. గ్రంధి విగ్రహం ఏర్పాటు విషయంలో తానేదో తప్పు చేసినట్లు ఆమె మాట్లాడడం బాధ్యతారా హిత్యానికి నిదర్శనమన్నారు. ఈ విషయంలో జరిగిందేమిటో తాను చెప్పడం జరిగిందని అదేదో తప్పుగా భావించి ఆమె మాట్లాడడం మంచిదికాదన్నారు. నా స్థాయి, ఎక్కడినుంచి వచ్చావో తెలుసుకోవాలని చెల్లి అలేఖ్యమ్మ వ్యగ్యంగా చెప్పారన్నారు. "మా అమ్మ దోశలుపోసి డిగ్రీ చదివించి నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చారని" కనమర్లపూడి తెలిపారు. రైల్వేరోడ్డులోనే జీవితమంతా సాగిస్తున్నానన్నారు. మూడుసార్లు వరుసగా కౌన్సిలర్గా గెలిచి హ్యాట్రిక్ సాధించానన్నారు. ఒక్కసారి కౌన్సిలర్గా తన చెల్లి అలేఖ్యమ్మ గెలిచిందో లేదో కానీ, ఛైర్మన్సీటు కోసం వెంపర్లాడిందన్నారు. వైసిపిలో ఉంటూ ఆ పార్టీకి వెన్నుపోటుపొడిచి అర్ధరాత్రి టిడిపి పార్టీలో చేరి ఆమె ఛైర్పర్సన్ అయ్యారని కనమర్లపూడి తెలిపారు. తాను మూడుసార్లు హ్యాట్రిక్ కౌన్సిలర్గా గెలిచినందుకు మా గురువు మీ తండ్రి గ్రంధి నన్ను వైస్ఛైర్మన్గా కూర్చోపెట్టవచ్చుకదా... అని కనుమర్లపూడి ప్రశ్నించారు. తాను వెన్నుపోటు పొడిచినట్లు భావిస్తే నీ తండ్రి గ్రంధి విగ్రహంవద్ద చెల్లి అలేఖ్యమ్మ ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. నేను వెన్నుపోటు పొడవలేదని నా ఇష్టదైవం కన్యకా పరమేశ్వరి తల్లి, శివాలయం వద్ద ప్రమాణం చేస్తానని కనమర్లపూడి తెలిపారు. తానున్న పార్టీకి కట్టుబడి పనిచేశానేతప్ప వెన్నుపోటు పొడవలేదన్నారు. చెల్లెమ్మా... చెబితే ఇంకా చాలావుంది... ప్రస్తుతం ఇంతటితో ఆపుతున్నానంటూ కనమర్లపూడి తనదైనశైలిలో సెటైర్లు వేశారు. ఈ సమావేశంలో బోగోలు మండల అద్యక్షుడు వీరరఘుయాదవ్, గంధం ప్రసన్నాంజనేయులు, పరుసు మాల్యాద్రి, దావులూరు మాల్యాద్రిలు మాట్లాడుతూ ఇక్కడినుంచి వెళ్లిన టిడిపి నేతలు అక్కడ పదవులకోసం ప్రాకులాడుతూ విమర్శలు చేయడంతప్ప అంతకు మించింది ఏమీలేద న్నారు. దమ్ముంటే ప్రతాప్రెడ్డి అడిగినదానికి సమాధానం చెప్పలేక లేనిపోని నిందలు వేస్తూ పబ్బం గడుపుకోవడం ఏమిటని వారు దుయ్యబట్టారు. ప్రతాప్రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరికలు చేశారు. ఇప్పుడు చేసే ప్రారంభోత్స వాలన్నీ వైసిపి పాలనలో చేసిన అభివృద్ధే అని వారు గుర్తుచేశారు. వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కుందుర్తి కామయ్య, చెన్ను ప్రసాద్రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, గుడ్లూరు మాల్యాద్రి, గుర్రం వెంకటేశ్వర్లు (జివి), షేక్.నాయబ్రసూల్, ఎస్వి దయాకర్రెడ్డి, ద్రోణాదుల వెంకట్రావు, వైసిపినేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రీ సర్వేకు రైతులు సద్వినియోగం చేసుకోండి



**ముత్తుకూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని కృష్ణపట్నం రెవిన్యూ గ్రామంలో రైతులు భూములకు సంబంధించి రీ సర్వే చేయడం జరుగుతుందని తహశీల్దార్ పి.స్వప్న మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వప్న మాట్లాడుతూ త్వరలో కృష్ణపట్నం గ్రామంలో ప్రారంభించనున్న రీ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కృష్ణపట్నం గ్రామంలో ఉన్నటువంటి భూ సమస్యలు రీ సర్వే నందు పూర్తి స్థాయిలో పరిష్కరించబడుతాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కె.శ్రీనివాసులు, మండల డిప్యూటి సర్వేయర్ అనురూప్, విఆర్‌ఓ ఉమా, సర్వేయర్ బ్రహ్మయ్య, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లుతో పాటు గ్రామ పెద్దలు నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు పై చర్యలు తీసుకోండి



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** నెల్లూరు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి పోలీసులను కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన టిడిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లు సీమరాజా అలియాస్ చంద్రకాంత్ చౌదరి, యాష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు మెమొరాడం అందజేశారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రజలకు జనరంజక పాలన అందించారని జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తల పై తప్పుడు కేసు బనాయించి వారిని ఇబ్బందులు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే తెలుగుదేశం పార్టీ ఇలాంటి ఆకృత్యాలు పాల్పడుతుందని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఏడాది కాలం అస్తవ్యస్త పాలనతో ప్రజలను ఇబ్బందికి గురి చేస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని, వాటిని డైవర్ట్ చేసేందుకు టిడిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ల చేత ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. ముఖ్యంగా టిడిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ లు సీమ రాజా అలియాస్ చంద్రకాంత్ చౌదరి, యాష్ వీరిద్దరూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై సోషల్ మీడియా వేదికగా డిబేట్లు, నిర్వహిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ కార్యకర్తల మనోభావాలను కించపరుస్తున్నారని తెలిపారు. వారి ఇరువురిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, పోలీసులను కోరామని, పోలీసులు ఈ విషయంలో చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గర్భిణి, బాలింతలకు బాల సంజీవన్ కిట్టు పంపిణీ



**విడవలూరు, కొడవలూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం పక్షోత్సవాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న సమయంలో పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. ఎక్కువగా ఆకుకూరలు, పాలు, గుడ్లు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, పండ్లు తినాలని వివరించారు. అంతకుముందు లబ్ధిదారులతో రాలి నిర్వహించారు. అనంతరం బాలింతలు,గర్భవతులకు బాల సంజీవని కిట్టును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు యస్మాన్ రమీజా, నాగరాజమ్మ, కామేశ్వరి, శాంతి, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

## రేపు సర్వసభ సమావేశం ఎంపీడీవో సుబ్బారావు



**కొడవలూరు, విడవలూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** మండలంలో ఉన్న పంచాయతీలలో వివిధ పథకాల ద్వారా నిధులు రావడం, జరిగిన పనులు వివరించి ముఖాముఖి తెలుపుటకు17వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వ సభ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శులు, వివిధశాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేశారు.

## ప్రజలకు కోసం చలివేంద్రం ఏర్పాటు యస్దాని భాషా



**విడవలూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వలన జిల్లా అధికారులు ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో నగేష్ కుమారి ఆధ్వర్యంలో మండల కేంద్రం గ్రామ సచివాలయంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఎస్దాని భాషా ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామం నుండి వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులకు తలెత్తకూడదని చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

## అతి తక్కువ ఖర్చుతో మోకాలి మార్పిడిలు

**- సురక్షితంగా రోబోటిక్‌తో శస్త్ర చికిత్సలు**



**నెల్లూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త-వైద్యం :** అతి తక్కువ ఖర్చుతోనే అపోలో హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. మంగళవారం నగరంలోని చివరి సమీపంలో ఉన్న అపోలో ఆసుపత్రిలో పత్రికా విలేకర్ల సమావేశంలో అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్; ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్లు, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి మాట్లాడారు. రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయడంలో నెల్లూరు అపోలో హాస్పిటల్ అగ్రగామిగా ముందుకు వెళ్తుందని చెప్పారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో అధునాతన విధానంలో రోబోటిక్ సాయంతో మెకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోబోటిక్ సాయంతో చేసే శస్త్ర చికిత్సలు 100 శాతం ఖచ్చితత్వంగా ఉంటాయని పేర్కొన్నారు. అంతే కాకుండా అతి తక్కువ రక్త స్రావంతో పాటు శస్త్ర చికిత్సకు సంబంధించిన మచ్చలు కూడా ఉండవన్నారు. శస్త్ర చికిత్స తర్వాత నొప్పి కూడా చాలా తక్కువగా ఉంటుందని, వేగంగా కోలుకోవచ్చని చెప్పారు. శస్త్ర చికిత్స తర్వాత హాస్పిటల్‌లో ఎక్కువ రోజులు కూడా ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు. నెల్లూరులో అపోలో హాస్పిటల్‌ను ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేవలం రూ.2లక్షల 50 వేల ఫీజుతోనే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ఉన్న రోగులు సద్వినియోగం చేసుకోవాని డాక్టర్ శ్రీరాం సతీష్, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో వారితో పాటు ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై సమీక్షా సమావేశం



**మర్రిపాడు, ఏప్రిల్15, ప్రభాతవార్త:** మర్రిపాడు మండల పరిధిలోని వెలుగు ఆఫీస్ భవనంలో మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలోప్రకృతి వ్యవసాయంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక వ్యవసాయాధికారి రామ్మోహన్ ,ఎపిఎం బుజ్జమ్మలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని , రైతులు రసాయన ఎరువులకు అలవాటుపడి విపరీతమైన మందులు వాడి ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. కానీ ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని , మన చుట్టుప్రక్కల ఉన్న ఆకులతోటి పిచ్చికారి చేసి విషపూరితమైన కీటకాలు చనిపోయే విధంగా తయారు చేయవచ్చన్నారు. దీంతో ఎక్కువ దిగుబడులను సాధించడమే గాక ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో పొదుపు విఎలు, ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్‌పిలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో రెండో రోజు అగ్ని మాపక వారోత్సవాల కార్యక్రమం



**ఉదయగిరి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఆర్టీసీ గ్యారేజ్ నందు రెండో రోజు మంటలు ఆర్పే విధానాన్ని సదస్సు, నిర్వహించారు. అగ్ని మాపక వారోత్సవాలు కార్యక్రమాన్ని స్టేషన్ ఇన్ ఛార్జీ అశోక్ కుమార్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం రెండో రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944లో ముంబై డాక్ యార్డ్ ఓడలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 71 మంది అగ్ని మాపక సిబ్బంది అధికారులు మృతికి సంఘీభావంగా వారి ఆత్మ శాంతి కోసం నివాళులర్పించామన్నారు. అనంతరం ప్రమాదం సంభవించినప్పుడు అగ్ని మాపక సిబ్బంది వినియోగించే పరికరాలను ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఉదయగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అగ్ని మాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు వారం రోజులు పాటు జరుగుతాయన్నారు. ఒక్కో రోజు ఒక ప్రదర్శన చేసి చూపిస్తారని ఆయన అన్నారు.అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే గడ్డి వాములుగా వేయాలని, నివాస గృహాలకు తప్పినిసరిగా 60 అడుగుల దూరం పాటించాలని పెద్ద గడ్డి వాములకు బదులుగా చిన్న చిన్న గడ్డి వాములను ఏర్పాటు చేయాలని, గుడిషకు గుడిసెకు మధ్యన కనీసం దూరం పాటించాలని, బహిరంగ మంటలను అనుమతించరాదని, దీని వలన నిప్పు రవ్వలు గాలిలో ఎగిరి ప్రమాదానికి కారణమగునని, అందుబాటులో తగినంత నీటిని బిందెలతో గాని కలవలతో గాని నిల్వ చేసుకోవాలని చెప్పారు. ఇళ్లల్లో కిరోసిన్ దీపాలను తగినంత రక్షణతో ఉపయోగించాలని, గడ్డి వాములకు దగ్గరగా ఎటువంటి అద్దం మొక్కలను ఉంచరాదు, పడవేయరాదు, గుడిసెలు, ఎలక్ట్రికల్ వైర్లు యొక్క జాయింట్ ఉండరాదు, ఒక ప్లగ్గుతో ఎక్కువ కనెక్షన్లు ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక ఇన్‌ఛార్జీ ఆఫీసర్ అశోక్‌కుమార్, లీడింగ్ ఫైర్ మాన్ బి. అంకయ్య, కే.అరయ్య, అగ్నిమాపక సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీ కేసు నమోదు



**ఉదయగిరి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** ఉదయగిరిలోని మంగళకట్ట వీధిలో ఆదంస హబీబున్నీసా ఇంటిలో 8 సవర్ల బంగారం చోరీ జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆదంస హబీబున్నీసాల బంధువు, దుత్తలూరు మండలంలో చనిపోగా వారు అక్కడికి వెళ్లారని, వారి కుమారుడు ఇంటి దద్దర ఉన్నాడని బాలుడు ఆడుకోవడానికి వెళ్లి సమయం చూసి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న దాదాపు ఎనిమిది సవర్ల బంగారం అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఈయన వెంట రెండవ ఎస్సై శ్రీనివాసులు కూడా ఉన్నారు.

## ప్రతిభా విద్యార్థికి అభినందనలు



**వింజమూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** వింజమూరులోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్న బి.వెంకట సుశాంత్ 1000 మార్కులకు గాను 962 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. మంగళవారం కావలి ఏబీసీడబ్ల్యూ అధికారి వెంకటేష్ వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట సుశాంత్, వారి తండ్రిని అభినందిస్తూ చిరు సన్మానం చేయించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వసతి గృహంలోని విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తాన్నామని పౌష్టికాహారంతో పాటు అల్పాహారం కూడా పరిశుభ్రంగా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని చక్కగా చదివి ఉత్తమ మార్కులు పొందేందుకు ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు పి.వెంగళరావు, రియాజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఈకెవైసి త్వరితగతిన పూర్తిచేయండి

**బిట్రగుంట ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు త్వరితగతిన ఈపాస్ మిషన్ లో ఈకెవైసి లబ్ధిదారులు చేత చేయించాలని కావలి సిఎస్ డిటి ఎం. విజయమ్మ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈనెల 30 వ తేదీ లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించిన పిదప సంక్షేమపథకాలు దృష్టిలోఉంచుకొని ఎవ్వరు నష్టపోకుండా అందరికి అందేలా చూడాల్సిన బాధ్యత డీలర్లు, ఎండియు ఆపరేటర్లు తీసుకోని అవగాహన కల్గించాలని సూచించారు.

### ఉద్యోగం చేయడానికి వచ్చావా..! రాజకీయం చేయడానికి వచ్చావా..!

## పోలినేనిచెరువు కార్యదర్శిపై ఎమ్మెల్యే ఆగ్రహం

**వలేటివారిపాలెం ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిచెరువు పంచాయతీ కార్యదర్శి గణేష్ పనితీరుపై ఆ గ్రామ తెదేపా నాయకులు శనివారపు మాల్యాద్రి,నాగిరెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు పిర్యాదు చేశారు.ఈ మేరకు శనివారం ట్రాక్టర్లు పంపిణీ కార్యక్రమ సందర్భంగా వలేటివారిపాలెం వచ్చిన ఎమ్మెల్యేకి వినతిపత్రం అందచేశారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని,సైడు కాలువల్లో నీరు నిలిచి పోయిందని పలుమార్లు కార్యదర్శికి వివరించినా వినడం లేదని,ఫోన్ తీయడం లేదని,పైగా వైసీపీ సర్పంచ్ వద్దకు వెళ్లమని సలహా ఇస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యదర్శి మాకొద్దు అంటూ ఎమ్మెల్యే ఎదుట ఆవేశభరితంగా వాపోయారు. తగిన చర్యలు నిమిత్తం రెండు సార్లు ఎంపీడీవోకి వివరించినా మాకు న్యాయం జరగలేదన్నారు.ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వర రావు కార్యదర్శిపై గణేష్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.ఉద్యోగం చేయడానికి వచ్చావా..రాజకీయం చేయడానికి వచ్చావా..నీవేమన్నా పంచాయతీ సక్రటరీవా..ప్రిన్సిపల్ సక్రటరీవా..ఏమనుకుంటున్నావ్ పైగా సలహాలు ఇస్తున్నవటగా.వల్లుదగ్గరపెట్టుకొని పనిచెయ్..అంటూ మండిపడ్డారు. మండలంలోని పలువురు సచివాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శుల పనితీరు గత కొంత కాలంగా అధ్వానంగా ఉంది. గౌరవప్రదంగా, ఆదర్శంగా ఉండాల్సిన పలువురు సిబ్బంది పనితీరు పలు విమర్శలకు తావిస్తోంది.తరచూ విధులకు గైరుహాజరవడం,వివిధపనులపై సచివాలయాలను సందర్శించిన అర్జీదారులుతో అమర్యాదగా వ్యవహరిస్తుంటారు.సర్వేల పేరుతో ప్రధాన బాధ్యతలైన ఇంటిపన్ను,కరెంటు బిల్లు వసూలు విస్మరి స్తున్నా రు. నిర్దేశత ప్రాంతాల్లో అందుబాటులో లేకపోవడం ప్రజలకు బాగా ఇబ్బందిగా ఉంది.దీంతో పలువురు సిబ్బంది పనితీరును ప్రజలు అసహ్యం చుకుంటున్నారు. ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు.అయినా ఎంపీడీవో, ఈవోఆర్డీవో తదితరులు ఎవరూ పట్టించుకోవడం లేదు.ఇందులో బాగంగా నలదలపూరులోని ఓ ఉద్యోగికి గ్రామస్తులకు మద్య వివాదం నెలకొంది.ఒకరిపై ఒకరు పలు ఆరోపణలు చేసుకున్నారు.ఈ వ్యవహారం కలెక్టర్ దాకా వెళ్లింది.చివరకు ఆయన అక్కడ పనిచేయలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.అదేవిధంగా పోకూరు సచివాలయంలో పలువురు సిబ్బంది గైరు హాజరవుతుంటారు.చంద్రమౌళి అనే రైతు తాగునీటి బోర్లును రిపేరు చేయమని నెలలు తరబడి సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు.మరో రైతు తన పట్టాపొలాన్ని వేరే వారి పేర ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ఆరోపిస్తున్నారు.తొలగించాలని వీఆర్వో కోసం సచివాలయం, తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.ఇదేవిధంగ దాదాపు అన్ని గ్రామాల్లో సిబ్బంది పనితీరు విమర్శనాత్మకంగా ఉంది. అయ్యవారిపల్లె,అంకభూపాలపురం గ్రామ సచివాలయ భవ నాలు పూర్తయి ఏడాదిదాటింది.అయినా అద్దె భవనాల్లోని వీటిని నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ సొమ్ము దుర్వి నియోగం చేసినట్లవుతుంది.ఇటీవల ఎమ్మెల్యే పోకూరు సచివాలయ ఆకస్మిక తనిఖీలో గైరుహాజరైన సిబ్బ ందికి మెమో జారీచేశారు.అదేవిధంగా వలేటి వారిపాలెం, అత్తంటివారిపాలెం, బడేవారిపాలెం, కూని పాలెం ,కలవళ్ల, నూకవరం, కొండసముద్రం ,శాఖ వరం,పోలినేనిపాలెం సచివాలయాల్లోని పలువురు సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.పలితంగా ప్రభుత్వానికిచెడ్డపేరు వస్తుంది.

## ముస్లిం హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం




**మర్రిపాడు, ఏప్రిల్15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మర్రిపాడు తహసిల్దార్ కార్యాలయం వద్ద మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈకార్యక్రమానికి ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌చట్టాన్ని అమలు చేయడం ద్వారా ముస్లింల హక్కులను పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం హరిస్తుందన్నారు. ఈచట్టం పూర్తిస్థాయిలో అమలయితే ముస్లింలకు బరస్థాన్లు కూడా ఉండవన్నారు. ముస్లిం ఇతరులని ఈ కమిటీల్లో పెట్టడం ద్వారా రాజ్యాంగంలోని హక్కులను హరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశానికి మంచి చేయడం పోయి ముసిల ంలను టార్గెట్ చేయడం ద్వారా కొత్త కొత్త చట్టాలను, చట్ట సవరణలు చేసి ముస్లింలను మరింత అణిచివేతకు గురి చేస్తుందన్నారు. గత 11నెలల్లో బిజెపి ముస్లింలకు చేసిన మంచి ఏమీ లేదని ఈ వక్ఫ్ చట్టం అమలయితే ముస్లింలకు చెప్పుకునేందుకు ఏమీ మిగలదన్నారు. ప్రజలందరూ సంఘటితమూ కేంద్రం చేస్తున్న చట్టాలను చట్ట సవరణలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆవాజ్‌కమిటీ సభ్యులు , నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని సత్కరించిన దగదర్తి మండలం నేతలు



**కావలి, ఏప్రిల్15 ప్రభాతవార్త :** టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం కావలి ముసునూరులోని ఎమ్మెల్యే దగుమాటిని దగదర్తి మండలం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దగుమాటిని దుశ్శాలు వాతో సత్కరించారు. దగదర్తి మండల అభివృద్ధికి ఎమ్మెల్యే దగుమాటి నాయకత్వంలో కలిసి పనిచేస్తా మని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీలో క్రియాశీలకంగా ఉన్న వింజం మురళి మోహన్, వింజం కొండపనాయుడు, వింజం వెంకపనాయుడు, వింజం నారపనాయుడు, దొడ్డపనేని నరేం ద్రనాయుడు, కాట్రాయపాడు తాళ్లూరు మోహన్‌నాయుడు, తదితరులు ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్15 ప్రభాతవార్త :** ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులను మంగళవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అభినందించారు. కావలి ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి విద్యార్థులు తరలివచ్చారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులందరికి పూలబొకే అందచేసి ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇష్టమైన కోర్సులు తీసుకుని నచ్చిన వృత్తి, ఉద్యోగాల్లో రాణించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. వారికి పలుసూచనలు అందచేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన అధ్యాపకులకు, యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీచైతన్య యాజమాన్యం ఎమ్మెల్యే దగుమాటిని దుశ్శాలువాతో సత్కరించి పూలబొకే అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వెంకయ్య, డైరక్టర్లు పివియస్ ప్రసాద్, ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ టివి.లుకోథర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు పట్టణ పరిస్థితిని సిసి కెమెరాలో పర్యవేక్షిస్తున్న సిఐ గంగాధర్



**ఆత్మకూరు, ఏప్రిల్15,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన సిసికెమెరాలను తమ కార్యాలయంలో ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.గంగాధర్ నిరంతరం పర్యవేక్షిస్తూ పట్టణ పరిస్థితిని తెలుసుకుంటున్నారు. కార్యాలయానికి ఉదయం 8గంటలకే చేరుకలొని కార్యాలయ నిర్వహణతోపాటు సిసికెమెరాల ద్వారా పట్టణ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నెల్లూరుపాళెం నుండి బట్టేపాడు రోడ్డు వరకు బైపాస్ రోడ్డు, సత్రం సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉన్న మొత్తం సిసికెమెరాలను తన సమయానుకూలంగా క్షుణ్ణంగాపరిశీలిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్‌నియంత్రణ , ఇతర సమస్యలను గమనిస్తూ ఎక్కడా గొడవలు జరగకుండా చూస్తున్నారు. ఎక్కడైనా గొడవలు జరిగితే వెంటనే తమ సిబ్బందిని పంపి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు.

## సోలార్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ



**నెల్లూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని మాగుంట లేఅవుట్‌లో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ ఇంటింటికి వెళ్లి సోలార్ విద్యుత్‌పై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల వారికి ఎటువంటి లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం వల్ల వినియోగదారులకు ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆ వినియోగదారుల మాటల్లోనే తెలుసుకోవడానికి కలెక్టర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేపట్టినట్లు తెలియజేశారు. వినియోగదారులకు తెలియజేయడం ఏమనగా సోలార్ విద్యుత్ వినియోగం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, దాని వల్ల పర్యావరణానికి మీ కరెంటు బిల్లు ఆదా కావడానికి చాలా ఉపయోగపడుతుందని ప్రభుత్వం కూడా ఈ సోలార్ విద్యుత్ వినియోగం పట్ల క్షేత్ర స్థాయి వరకు దీని ఉపయోగాలు తెలియజేయాలని ఆ దిశగా ప్రభుత్వం కూడా అడుగులు వేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ నెల్లూరు శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ దామోదర్ రెడ్డి, సోలార్ వినియోగదారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



**చేజర్ల ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్య కలిగి ఉంటారని ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం చేయాలని మండల వ్యవసా యాధికారి శశిదర్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల స్టాల్స్ గ్రీవెన్స్‌డే సోమవారం రోజు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం వెలుగు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయాధికారులు వెలుగు అధికారులు రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గోనడం జరిగింది. అనంతరం శశిదర్ మాట్లాడుతు ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులను ఉపయోగి ంచుకోవాలన్నారు. వ్యవసాయం చేసే రైతులు ప్రకృతి వవమూలికల ద్వారా కషాయాలు తయారు చేసుకొని వ్యవసాయం కి ఉపయోగించాలని సూచించారు. వెలుగు ఏపిఎం సృజన మాట్లాడుతు ప్రతి మహిళా సంఘం సభ్యులు ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో ట్రైనర్ సుబ్బయ్య, వివో ఏ వెలుగు సిసిలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గోన్నారు.

## దువ్వూరు బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు




**సంగం ఏప్రిల్ 15 ప్రభాతవార్త :** సంగం మండలం దువ్వూరు బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రంను ఎంపిడిఒ షాలెట్, డిఎల్‌పిఒ నయిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతు వేసవి కాలం ఎండలు ఎక్కువగా ఉన్నాయని చలివేంద్రం ఏర్పాటు చేయాడం చాలా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైవేలో వెళుతున్న వారికి మజ్జిగ అందజేశారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ హామీద్, నెల్లూరు పార్లమెంట్ యువత ప్రధాన కార్యదర్శి జడపల్లి దయాకర్‌గౌడ్,గ్రామ టిడిపి నాయకులు మారెళ్ళ శ్రీనివాసులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న సబ్ ఇన్స్‌పెక్టర్ ఒట్టూరు శ్రీనివాసులు




**కావలిరూరల్, ఏప్రిల్15 ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు వృత్తిరీత్యా నెల్లూరులో సబ్ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వ హిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు మంగ ళవారం వారి తండ్రి కీర్తిశేషులు ఒట్టూరు మాలకొండయ్య 5వ వర్ధంతిని పురస్క రించుకుని కావలి విట్స్ కళాశాలలో ఎంసిఎ పూర్తిచేసుకుని తన ఒరిజినల్ సర్టిఫికెట్స్ తెచ్చుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సాయిప్రియకు సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు తమవంతుగా 10వేల రూపాయలు సంయుక్తసేవాసంస్థ కార్యాలయంనందు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంవి ప్రసాద్‌రావు, ఎం.చంద్రశేఖర్‌లు మాట్లాడారు. ఎంసిఎ చదువుకుని కాలేజీలో ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సాయిప్రియకు 10వేల రూపాయలు అందచేసిన సబ్ఇన్స్‌పెక్టర్ ఒట్టూరు శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలియచేశారు. స్వర్గీయ ఒట్టూరు మాలకొండయ్య ఎన్నో కష్టాలు ఎదుర్కొని కేవలం చేతివృత్తి ద్వారానే వారి ఐదుమంది సంతానాన్ని ఉన్నత చదువులు చదివించారని తెలియచేశారు. ఒట్టూరు శ్రీనివాసులు తండ్రి ఆశయాలలో భాగంగానే విద్యను ప్రోత్సహించడంకోసం సాయిప్రియకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని అన్నారు. ఆర్థికసహాయం అందుకున్న సాయిప్రియ దాతకు సంయుక్త సేవాసంస్థద్వారా ధన్యవాదాలు తెలియచేశారు.

## దొడ్ల కోదండరామిరెడ్డి సేవలు ప్రశంసనీయం



**బుచ్చి ఏప్రిల్ 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలకు ఎంతో సేవ చేస్తున్న డైరెక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి సేవలు అభినందనీయమని హాస్పటల్ సూపరెండెంట్ పద్మజా ప్రశంసించారు. మంగళవారం హాస్పటల్‌లో చెన్నైకి చెందిన వరదారెడ్డి చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఇన్‌వర్టర్ కోసం లక్షరూపాయాలు చెక్కును అందజేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కోదండరామిరెడ్డి గతంలో పేద ప్రజలకు తనవంతు సహాయం అందించాలని హాస్పటల్‌కి అవసరమైనవన్ని ఇస్తున్నారని ఆమె తెలిపారు.ప్రస్తుతం ఓపి కూడా 250 పైన వస్తుందని చెప్పారు.నెలకు సుమారు 25 డెలివిరిలు చేస్తున్నట్లు తెలిపారు. గుండె పోటుకు కూడా సుమారు 50 వేలరూపాయాలు ఇంజక్షన్ ఉందని ఆమె తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందిస్తుందని అన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు ఎం.వి శేషయ్య మాట్లాడుతు దొడ్ల వారి కుటుంబం మొదటి నుండి పేద ప్రజలకు ఏదో ఒకటి చేస్తున్నాయని అన్నారు. కోదండరామిరెడ్డి హాస్పటల్‌కి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. దాతలు స్పందించి ప్రభుత్వ వైద్యశాలకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. డైరెక్టర్ తుమ్మల ప్రసాద్, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, దుగ్గిశెట్టి హరినాద్, సోల్లేటి ప్రభాకర్, పొన్నపోలు సుమన్, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని సన్మానించిన మండల నాయకులు



**దగదర్తి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** కావలి శాసనసభ్యులు కావ్యా కృష్ణారెడ్డి కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పమిడి రవి కుమార్ చౌదరి ఆధ్వర్యంలో దగదర్తి మండలంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో క్రియాశీలకంగా కృషి చేసిన దగదర్తి గ్రామ స్థానిక నాయకుడు వింజం మురళీ మోహన్ కావలి నియోజకవర్గంలో మరీ ముఖ్యంగా దగదర్తి మండలంలో కోట్లాది రూపాయలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ కావలి నియోజకవర్గాన్ని కనకపట్నంగా మార్చేందుకు అలుపెరగని యోధునిగా కృషి చేస్తున్న కావలి శాసనసభ్యులు చేస్తున్న అభివృద్ధిలో మేము సైతం దగదర్తి గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. దగదర్తి మండల అభివృద్ధికి ఎమ్మెల్యే నాయకత్వంలో కలిసి పని చేస్తామని తెలిపారు. వారి వెంట దగదర్తి గ్రామ టీడీపీ నాయకులు వింజం కొండపనాయుడు, వింజం వెంకపనాయుడు, వింజం నారాయణ నాయుడు, దొడ్డపనేని నరేంద్ర, కాట్రాయపాడు టీడీపీ నాయకులు తాళ్లూరు మోహన్‌రావు, కాకి సుధీర్ పాల్గొన్నారు.

## పార్వేట ఉత్సవంలో సోమిరెడ్డి



**నెల్లూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని శ్రీరామ స్తూపం మైదానంలో శాస్త్రోక్తంగా సాగిన పార్వేట ఉత్సవంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, మాజీ శాసనమండలి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. శబరి శ్రీరామ క్షేత్రంలో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వారు పార్వేట ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరి సీతారామలక్ష్మణుడు, ఆంజనేయస్వామిని దర్శించుకోవడంతో పాటు మహాపూర్ణాహుతి సమర్పణలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేకపూజల సోమిరెడ్డిని ఆలయ మర్యాదలతో అర్చకులు సన్మానించారు.

## ఫిష్ పాండ్ పనులను పరిశీలించిన పీడీ గంగా భవాని



**వింజమూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** ఉపాధి హామీ పథకం ద్వారా వింజ మూరు పాతూరు చెరువులో జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను మంగళవారం డ్వామా పీడీ గంగా భవాని పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ రోజుకు సుమారు నాలుగు గంటలు పని చేయాల్సి ఉంటుందని, అప్పుడే 300 రూపాయలు కూలీ వస్తుందన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసి తమ యొక్క వేతనాన్ని పొందాలన్నారు. అలాగే కూలీలకు వేసవి తాపము నుండి తప్పించేందుకు నీడ నీరు లాంటి ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఏ విధంగానైనా కూలీలకు గిట్టుబాటు కూలి వచ్చే విధంగా పనులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుభాషిణి, ఈసీ కృష్ణారావు, టిఏ మురళి, ఎఫ్ఏ శ్రీనివాసులు, కూలీలు తదితరులు ఉన్నారు.

## అధ్వానంగా వీవీపాలెం:ఏబీపురం రోడ్డు



**వలేటివారిపాలెంఏప్రిల్ 15, ప్రభాతవార్త** వలేటివారిపాలెం- అంకభూ పాల పురం రోడ్డు అధ్వానంగా ఉంది. సుమారు 6 కి.మీ దూరం గల ఈ రహదారిని సుమారు ఐదేళ్లక్రితం తారు రోడ్డుగా మార్చారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై పాడైంది. అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి.రోడ్డు మార్జిన్‌లు దెబ్బతిన్నాయి. తారు కంకర లేచి పోతుంది.వర్షం వస్తే వాగును తలపిస్తుంటాయి. లింగపాలెం, రామచంద్రాపురం, అంకభూపాలపురం గ్రామస్తులు నిత్యం వివిధపనులపై రాకపోకలు చేస్తుంటారు. అదేవిధ ంగా కనిగిరి, అగ్రహారం వైపు వెళ్లుటకు ఇదే దగ్గర దారి. ఈ నేపధ్యంలో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. రకరకాల వాహనాలు టూ వీలర్స్ నిత్యం ప్రయాణిస్తుంటాయి. దీంతో కేవలం 10నిమిషాల ప్రయాణానికి సుమారు అరగంటకి పైగా సమయం వెచ్చించాల్సి వస్తుంది.పైగా వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు.ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దాదాపు అన్ని రోడ్లుకు మరమ్మత్తులు చేపడుతున్న నేపధ్యంలో ఎంతో ప్రాముఖ్యతగల ఈ రోడ్డును సైతం రిపేరు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులుకు విజ్ఞప్తిచేస్తున్నారు.

## వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకై దరఖాస్తుల స్వీకరణ

**నెల్లూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త విద్య** : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 2025 లో చేపట్టనున్న వేసవి క్రీడ శిక్షణ శిబిరాల నిర్వహణ కోసం దరఖాస్తులని ఆహ్వానిస్తున్నామని జిల్లా క్రీడాధికారి ఆర్ కె యాతిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వతేది నుండి 30వ తేదీ వరకు నిర్వ హించనున్న ఈ శిబిరల నిర్వహణకోసం క్రీడా శిక్షకులు , వ్యాయమ ఉపాధ్యాయులు, జతీయ, అంతర్జా తీయ క్రీడల్లో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులు వారి దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హత కలిగిన వారు ఈ నెల 17లోపు వారి దరఖాస్తులని అందించాలని కోరారు. మరిన్ని వివరాలకి తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణిని సత్కరించిన ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్15 ప్రభాతవార్త** కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొమరా చక్రపాణిని మంగళవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే దగుమాటిని మర్యాదపూర్వకంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి కలిశారు. చక్రపాణి సేవలను కొనియాడుతూ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. చక్రపాణి ఇప్పటికి మూడుసార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎంపిక కావడం ప్రత్యేకతను సంతరించుకుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, న్యాయవాదులు శివప్రసాద్‌రెడ్డి, భరత్, కొమరా పృథ్వీరాజ్, గౌతమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైను కనెక్షన్లను వేగవంతం చేయండి

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 15 ,ప్రభాతవార్త:** నగరవ్యాప్తంగా జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్ల, వాటర్ సప్లయ్ పనులను వేగవంతం చేసి, కాలుష్యరహిత నెల్లూరు నగరానికై తోడ్పడాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక తొమ్మిదవ డివిజన్ నవాబుపేట, కుసుమ హరిజనవాడ, యనమలపాలెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ,వాటర్ సప్లయ్ 49 జోన్ల నందు ఇంటింటి కనెక్షన్ల పనులను కమిషనర్ మంగళ వారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్. పి. నారాయణ ఆలోచనల మేరకు ప్రజలపై భారం పడకుండా భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లను కేవలం ఒక్క రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్లను నిర్దేశించిన ప్రతిరోజూ లక్ష్యాలను ఎల్ అండ్‌టి, మెగా సంస్థ ప్రతినిధులు త్వరితగతమున పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించా రు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా నగర వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణ పనులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించగలమని కమిషనర్ తెలియజేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానంతో దోమలు లేని పర్యావరణహితమైన సుందర నగరాన్ని నిర్మించుకోగలమని కమిషనర్ తెలిపారు. స్థానిక డ్రైవర్స్ కాలనీ, పొట్టేపాలెం మురుగునీటి శుద్ధి కేంద్రాలను కమిషనర్ పర్యటించి , కేంద్రాలలో జరుగుతున్న మురుగు నీటి శుద్ధి పనులను, వివిధ విభాగాల్లో పనితీరును పర్యవేక్షించారు.

## మున్సిఫాల్టీ కొట్ల వేలం పాట వాయిదా



**బుచ్చి ఏప్రిల్ 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీ కి సంబందించిన డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి,డాక్టర్ ఉక్కాల రాజేశ్వరమ్మ,డాక్టర్ బైన హేమలత,ఎస్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబందించి 16 వ తేది జరగాల్సిన వేలం పాట వాయిదా పడిం దని కమీషనర్ బాలకృష్ణా తెలిపారు. ఈనెల 23 వ తేది బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలోని ప్రజలందరు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు.

## కళారత్న హంస అవార్డు గ్రహీత దానంను సత్కరించిన ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్15 ప్రభాతవార్త** ఉగాది పురస్కారాల్లో జానపద రంగంలో కళారత్న హంస అవార్డుగ్రహీత దానం అంకయ్యను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఘనంగా సత్కరించారు.మంగళవారం కావలి మునూరులోని టిడిపి కార్యాలయంలో దానంను సత్కరించి మాట్లాడారు. కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి చెందిన దానం అంకయ్య ఉగాది పురస్కారాల్లో కళారత్న హంస అవార్డును మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా అందుకున్నారన్నారు. కావలి కీర్తిప్రతిష్ఠలను దానం అంకయ్య పెంచారని ఎమ్మెల్యే కొనియాడారు. గ్రామనాయకులు గుర్రం సునీల్‌కుమార్, పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి

### - కాటేపల్లి గ్రామస్తుల ఆవేదన



**వింజమూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** వింజమూరు మండలం కాటేపల్లి గ్రామ ప్రభుత్వ భూములను కాపాడుతూ పశువులకు మేత నీరు నీడ ఉండేవిధంగా రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని సర్పంచ్ విజయలక్ష్మీ, వైసీపీ నాయకుడు బండి కృష్ణారెడ్డి, బయన్న, గ్రామస్తులు మంగళవారం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటేపల్లి గ్రామంలో 277, 278 సర్వే నంబర్లు యందు కొందరు గ్రామస్తులు కాటేపల్లి ఎంపీటీసీ సభ్యుడు పల్లా పురుషోత్తం వారి కుమారుడు పల్లా మధు, ఐదో వార్డు సభ్యురాలు పల్లా విజయలక్ష్మీ, భర్త పల్లా వెంకటేశ్వర్లు, ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రొక్లైన్ సహాయంతో చెట్లను తొలగిస్తూ చదును చేసుకుంటూ ఉన్నారు. దీని వల్ల పశువులకు నీరు, మేత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 9వ తేదీన కొంత భూమిని 13వ తేదీన కొంత భూమిని చదును చేసుకుంటూ ఉన్నా ప్రభుత్వం అధికారులు మాత్రం తమకేమి తెలియనట్లు పట్టించుకోవడం లేదన్నారు. వీఆర్ఏ, వీఆర్వోలకు విషయాన్ని తెలియజేసిన నిమ్మకునీరెత్తిన్నట్లు ఉన్నారని అన్నారు. ఆ విషయంపై కాటేపల్లి గ్రామస్తులు ఇది వరకు వినతిపత్రాన్ని అందజేసిన ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం అందులోని చెట్లను తొలగించడం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల కలెక్టర్, కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని వారు తెలియజేశారు. ప్రభుత్వ సంపదను దోచుకుంటున్న అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూమిని పరిశీలించి అందులో తొలగించి ఉన్న చెట్ల విలువను ధర నిర్ణయించి పంచాయతీకి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటూ వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని లేని యెడల ప్రభుత్వ భూముల ఒక సెంటు కూడా ఉండే పరిస్థితి లేదన్నారు. కావున ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని, ప్రభుత్వ భూములను కాపడి మూగ జీవాలను రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



**నెల్లూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త-వైద్యం** : ఎమ్మెల్యే వేర్వేరు ఘటనలలో గాయపడ్డ బాధి తులను పరామర్శించేందుకై నెల్లూరు నారాయణ హాస్పిటల్‌కు విచ్చేసారు. విడవలూరులో అంబేద్కర్ జయంతి సందర్భంగా బాణా సంచా కాలుస్తూ ప్రమాదవశాత్తు గాయపడి నారాయణ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న శ్యాం అనే యువకుడ్ని ఆమె పరామర్శించారు. బుచ్చిరెడ్డి పాళెంలోని బాంబే రోడ్డుపై పారిశుధ్య విధులు నిర్వహిస్తూ లారీఢీ కొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి నెల్లూరు నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శానిటేషన్ ఉద్యోగి కర్రాదశయ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.విడవలూరుకు చెందిన శ్యాం, బుచ్చిరెడ్డి పాళెం పట్టణానికి చెందిన కర్రా దశయ్యలకు మెరుగైన వైద్య చికిత్సలు అందివ్వాల్సిందిగా ఆమె డాక్టర్లను సూచించారు. బాధితులకు ఏ అవసరమొచ్చినా తాను ఆదుకుంటానని ఆమె బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యేతో పాటు బుచ్చి కమిషనర్ , ఛైర్ పర్సన్‌మోర్ల సుప్రజ,టిడిపి నాయకులు వేమిరెడ్డిపట్టాభిరామిరెడ్డి, బెజవాడవంశీకృష్ణారెడ్డి,కోడూరు కమలాకర్ రెడ్డి,సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పారిశుధ్య కార్మికులను పరామర్శించిన

## వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి ఏఫ్రిల్ 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీకి చెందిన పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలు పాలై నెల్లూరు నారాయణ హాస్పట్‌లో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ,వైసిపి రాష్ట్ర అధికారప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారిని పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈకార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్,జిల్లా అధికారప్రతినిధి వీరి చలపతిరావు, బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, బుచ్చి నగర అధ్యక్షులు షేక్ .షాహుల్, వైసిపి నాయకులు కలువ బాలశంకర్‌రెడ్డి,16 వవార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ, కౌన్సిలర్ యానాదిరెడ్డి, కౌన్సిలర్ అనంతమ్మ, కౌన్సిలర్ మోర్ల జయంతి, కౌన్సిలర్ షేక్ షకిలాబేగం, కోవూరు నియోజకవర్గం డాక్టర్ అసోసియేషన్ విభాగం అధ్యక్షులు డాక్టర్ అల్లాబక్ష తదితరులున్నారు.

## చెన్నకేశవస్వామి ఆలయంలో మేకపాటి ప్రత్యేక పూజలు



**వింజమూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** వింజమూరులో చెన్నకేశ వ స్వామి బ్రహ్మో త్స వాల సందర్భంగా స్వామివారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపా ల్‌రెడ్డి మంగళ వారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి సాదర స్వాగతం పలి కారు. మాట్లాడుతూ ఎంతో మహిమాణిత్యచరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవస్వామి దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామి ఆశీస్సులు ఉదయగిరి నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు, గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లాల కొండారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, భయ్యాపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## జనవాసాలకు పరుగులు పెట్టిన జింక



**బుచ్చి ఏఫ్రిల్ 15 ప్రభాతవార్త** అడవి జంతువులు వేసవి కాలంలో నీటి ఎద్దడితో పట్టణాల్లోకి వస్తున్నాయని సంగం ఫారెస్టు బీట్ ఆఫీసర్ పెంచలయ్య తెలిపారు. అడివి నుండి వచ్చిన జంతువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బుచ్చిరెడ్డిపాళెంలోని ఒ సినిమాహాల్ బాత్ రూంలోకి దూరిన జింకును పట్టుకొని అడవిలోకి వదులు తామన్నారు.

## గృహిణి ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** సరైన కారణాలు తెలియలేదు కానీ క్షణికావేశంలో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మంగళవారం నగరంలో చోటు చేసుకుంది. చిన్న బజార్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు బి. నాగరాజు నెల్లూరులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఏడాది క్రితం పూర్ణిమ (30) నా మహిళతో ఇతని వివాహం అయింది. స్థానిక మూలాపేటలోని పోలీస్ క్వార్టర్స్ లో కాపురం ఉంటున్నారు. మంగళవారం పూర్ణిమ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక వీఆర్వో మహేష్ ఫిర్యాదు మేరకు చిన్న బజారు సీఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజుకు పూర్ణిమ ద్వితీయ వివాహం కాగా మొదటి భార్య కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోవడం గమనార్హం.

# పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై కార్పొరేషన్ ఎదుట నిరసన

### ఒక్క రోజు విధులు బహిష్కరించిన కార్మికులు

### నెల రోజుల్లో పరిష్కరిస్తామని కమిషనర్ హామీతో నిరసన విరమణ



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 15ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులు మంగళవారం ఉదయం 5.30 గంటలకు విధులు బహిష్కరించి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని నిరసన ధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ప్లకార్డులు, సిఐటియు జెండాలు చేతపట్టుకొని మా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా విడనాడాలని ,సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారీగా కార్మికులు కార్పొరేషన్ కార్యాలయంకు చేరుకోవడంతో కార్పొరేషన్ కార్యాలయం కార్మికులతో కిక్కిరిసింది. నినాదాలతో మారుమోగింది. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసుల జోక్యంతో అడిషనల్ కమిషనర్ వై. ఓ. నందన్ కార్పొరేషన్ కార్యాలయం చేరుకొని యూనియన్ నాయకులు మరియు కార్మికులతో సమస్యలపై చర్చ జరిపారు. అనంతరం కమిషనర్ సూర్యతేజ తో ఆయన ఛాంబర్ లో సమస్యలపై వివరంగా చర్చ జరిపి వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు నెలరోజులు గడువు ఇవ్వాలని అధికారులు కోరడంతో వారు ఇచ్చిన హామీతో కార్మికులు యూనియన్ నాయకులు ఆందోళన విరమిం చారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఆప్కాస్ ఉద్యోగులు కార్మికుల సమస్యలు పలు దఫాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. విధి లేని పరిస్థితుల్లో విధులు బహిష్కరించి ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడినదని అన్నారు. 60 సంవత్సరాలు నిండాయని 93 మంది కార్మికులను రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏ రకమైన సమాచారం లేకుండా నిర్లక్ష్యంగా పనిలో నుంచి ఆపివేయడం సరైన చర్య కాదని అన్నారు. చనిపోయిన కార్మికుల వారసులకు ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగాలు ఇవ్వలేదని చెప్పారు. చట్ట ప్రకారం అమలు చేయాల్సిన సెలవులు అమలు చేయడం లేదని ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయకపోవడం విచారకరమని బాధను వ్యక్త పరిచారు. పనిముట్లు కార్మికుల జేబులో డబ్బులు నుండి కొనుగోలు చేసుకోవడం విచారకరమన్నారు. బట్టలు సబ్బులు నూనెలు చెప్పులు గత మూడు సంవత్సరాల నుండి కార్మికులకు ఇవ్వడం లేదని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు చాలీచాలని జీతాలతో వస్తువులతో జీవిస్తున్నారని అన్నారు. అధిక వడ్డీలు అప్పులతో అల్లాడుతున్న కార్మికులకు ప్రభుత్వ బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు పూడికలు తీయడం,ట్రాక్టర్లకు ఎక్కించడం లాంటి పనులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రావిడెంట్ ఫండ్ ఈఎస్ఐ సమస్యలు పరిష్కారం కాకుండా అనేక రోజుల నుండి పెండింగ్లో ఉన్నాయని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ వర్తించని కార్మికులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే నిరవధిక ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, రూరల్ కార్యదర్శి కే పెంచల నరసయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేటు నాయకులు పి. సూర్యనారాయణ, మాల కొండయ్య, సుధాకర్,మహిళా సంఘం నాయకులు షేక్ మస్తాన్ బి,కత్తి పద్మ, షేక్ షంషాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు,కామాక్షమ్మ,దేశ మూర్తి, జైకుమార్, ఆర్ ఎం సునీల్ కుమార్, మనోజ్,తాళ్లూరు రమేష్,ప్రవీణ్, ముని మోహన్ బాబు,బాలు, షబ్బీర్, తాళ్లూరి భాగ్యమ్మ, సుజాతమ్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

